# అమెరికా ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపులు

## ఢిల్లీలో నిందితుడి అరెస్టు




**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** అమెరికాలోని ఓ ప్రసిద్ధ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్‌ను లైంగికంగా బెదరింపులకు గురిచేశారన్న ఆరోపణలపై ఓ వ్యక్తిని సిబిఐ అరెస్టు చేసింది. ఈ కేసులో నిందితుడు ఢిల్లీలోని అసోలా నివాసియైన రాహుల్‌కుమార్. అమెరికా నుంచి అందిన సమాచారం మేరకు సిబిఐకి చెందిన అంతర్జాతీయ కార్యకలాపాల విభాగం నిందితుడిపై కేసు నమోదు చేసిన తర్వాత అరెస్టు చేసింది. బ్లాక్‌మెయిల్ చేయాలనే ఉద్దేశంతోనే నిందితుడు ఫేస్‌బుక్ ప్రొఫైల్ ద్వారా సదరు ప్రొఫెసర్‌ను ఆకర్షించి విడియో చాటింగ్ చేస్తున్నప్పుడు లైంగికమైన చిత్రాలను సేకరించాడని సిబిఐ పేర్కొన్నది. ఆకర్షణకు లోనైన సదరు ప్రొఫెసర్.. నిందితుడితో విడియో చాటింగ్ చేస్తున్నప్పుడు లైంగిక విడియోలను పంపుతున్నప్పుడు అతడు వాటిని రికార్డు చేసి ఆ తర్వాత బెదరింపులకు పాల్పడ్డాడని సిబిఐ పేర్కొన్నది. లైంగిక అసభ్యకరమైన సంభాషణల సంబంధించిన విడియో చాటింగ్ ఉన్న ఇమెయిల్ అకౌంట్స్‌ను ఉపయోగిస్తూ తనకు డబ్బు పంపాల్సిందిగా నిందితుడు రాహుల్ బెదరింపులకు పాల్పడ్డాడు. అలాగే.. తనకు పేపాల్ అకౌంట్ ద్వారా డబ్బు, ఇతర విలువైన వస్తువులు పంపాలని సదరు ప్రొఫెసర్‌ను నిందితుడు డిమాండ్ చేశాడు. లేదంటే ఆ విడియో సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదరించాడని సిబిఐ పేర్కొన్నది. దాంతో భయపడిన బాధిత ప్రొఫెసర్.. నిందితుడు రాహుల్‌కుమార్‌కు పేపాల్ అకౌంట్ ద్వారా 48వేల డాలర్లు పంపారు. అయినప్పటికీ నిందితుడు తనకు ఐ ఫోన్ చార్జర్, ఇయర్‌ఫోన్స్ పంపాలంటూ ఇమెయిల్స్ ద్వారా డిమాండ్ చేశారన్నారు. ఇదిలా ఉండగా.. న్యూఢిల్లీలోని అసోలాలోని నిందితుడు రాహుల్‌కుమార్ నివాసంలో తనిఖీ చేసి బెదరింపులకు పాల్పడిన సాక్ష్యాలను సిబిఐ సేకరించింది. అరెస్టు చేసిన నిందితుడిని శుక్రవారం కోర్టులో హాజరు పరిచినట్లు సిబిఐ పేర్కొన్నది.

# పెళ్లికి ముందు శృంగారం, సహజీవనంపై నిషేధం

## నూతన చట్టానికి సిద్ధమైన ఇండోనేసియా

**జకర్తా, డిసెంబరు 2 :** వివాహానికి ముందు శృంగారంలో పాల్గొనడం, సహజీవనం చేయడంపై నిషేధం విధిస్తూ నూతన చట్టాన్ని తేవడానికి ఇండోనేసియా సిద్ధమైంది. చట్టాన్ని ఉల్లంఘించినవారికి ఏడాదిపాటు జైలుశిక్ష లేదా భారీ జరిమానా విధించనున్నారు. ఇందుకు సంబంధించిన క్రిమినల్ కోడ్ ముసాయిదాను ఈ నెలలోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. దీనిపై ఇండోనేసియా న్యాయశాఖ ఉపమంత్రి ఎడ్వార్డ్ ఒమర్ షరీఫ్ హియారీజ్ వివరణ ఇచ్చారు. పెళ్లికి ముదు శృంగారం, సహజీవనం చేయడం నిషేధం విధిస్తామని ఎడ్వార్డ్ ఒమర్ తెలిపారు. భార్య లేదా భర్త కాకుండా ఇతరులతో ఎవరైనా శృంగారంలో పాల్గొంటే, అలాంటివారిని వ్యభిచారులుగా పరిగణించి శిక్ష విధిస్తామన్నారు. కేటగిరీ 2 కింద గరిష్ఠంగా ఏడాది జైలుశిక్ష లేదా భారీ జరిమానా ఉంటుందని తెలిపారు. తమ దేశ పౌరులతోపాటు విదేశీయులకూ ఇవే నిబంధనలు వర్తిస్తాయన్నారు. ఇండోనేసియా విలువలకు తగ్గట్లుగా నూతన చట్టాన్ని తెస్తున్నందుకు గర్వపడుతున్నామన్నారు. ప్రపంచంలోనే అత్యధిక ముస్లిం జనాభా కలిగిన దేశం ఇండోనేసియా. మహిళలు, మతపరమైన మైనారిటీలు, స్వలింగ సంపర్కులపై ఎన్నో ఆంక్షలు విధిస్తున్నారన్న విమర్శలు ఇండోనేసియా పాలకులపై ఉన్నాయి. అయినప్పటికీ, తమ సంప్రదాయిక విలువలకు అనుగుణంగా కొత్త చట్టాన్ని తెస్తున్నామని ఆ దేశ పాలకులు సమర్థించుకుంటున్నారు. ఇప్పుడు రూపొందించిన ముసాయిదా చట్టాన్ని 2019లోనే తెచ్చేందుకు ప్రయత్నించారు. ఆ చట్టం పౌరస్వేచ్ఛను అణచివేసేలా ఉన్నదని దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. దాంతో దిగొచ్చిన ప్రభుత్వం పౌర సమాజంతో సంప్రదింపులు జరిపి కొన్ని మార్పులతో ఈ నూతన చట్టాన్ని తీసుకువచ్చేందుకు సిద్ధమైంది.

# ప్రజాస్వామ్య దేశంలో ఏంచేయాలో మాకు తెలుసు.. ఎవరూ చెప్పాల్సిన పనిలేదు

## ఐరాసలో భారత రాయబారి రుచిరాకాంబోజ్

**న్యూయార్క్, డిసెంబరు 2 :** ప్రజాస్వామ్య దేశంలో ఏంచేయాలో తమకు స్పష్టంగా తెలుసని ఐక్యరాజ్యసమితిలో భారత రాయబారి రుచిరా కాంబోజ్ తెలిపారు. ఐరాస భద్రతామండలిలో డిసెంబర్ నెలకు భారత్ తరఫున ఆమె అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో నెల రోజుల భారత ప్రణాళికపై మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమెకు భారత్‌లో ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ అమలవుతున్న తీరుపై మీడియా నుంచి ఓ ప్రశ్న ఎదురైంది. దానికి ఆమె ఘాటుగా సమాధానమిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఏంచేయాలో తమకు మరొకరు చెప్పాల్సిన పనిలేదని ఆమె అన్నారు.

'భారత్ ప్రపంచంలోనే అత్యంత పురాతన నాగరికత ఉన్న దేశం, ఇక్కడ ప్రజాస్వామ్యం వేళ్లు 2500 ఏళ్ల క్రితమే నాటుకొన్నాయి. మాది ఎప్పుడూ ప్రజాస్వామ్య దేశమే. ఇక ఇటీవల కాలానికొస్తే ప్రజాస్వామ్యానికి అవసరమైన శాసన, కార్యనిర్వాహక, న్యాయ, ప్రెస్ రూపంలో నాలుగు మూలస్తంభాలున్నాయి. అత్యంత చురుకైన సోషల్ మీడియా కూడా ఉంది. అందుకే భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా కొనసాగుతోంది' అని రుచిరా అన్నారు.

'ప్రతి ఐదేళ్లకోసారి ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికలు నిర్వహిస్తాం. ప్రతి ఒక్కరికి వారి అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఉండేలా వ్యవస్థ పని చేస్తోంది. మా దేశంలో వేగంగా సంస్కరణలు చేపడుతూ మార్పులు తీసుకొస్తున్నాం. ఈ విషయాన్ని నేను చెప్పాల్సిన పనిలేద్దు' అని భారత్‌లో జరుగుతున్న మార్పులను గుర్తు చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ నాయకత్వంలో ఐరాస భద్రతామండలిలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 31తో ఐరాస భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యదేశంగా భారత్ సమయం ముగుస్తుంది.

# 'బి' సీట్లపై కమిటీ!

≫ ఈ నేపథ్యంలో బి కేటగిరీ సీట్ల భర్తీలో జరుగుతున్న అక్రమాలతోపాటు.. బి కేటగిరీ సీట్ల భర్తీలో అక్రమాలు జరిగాయని వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి అటువంటి కాలేజీలపై ఎటువంటి చర్యలు తీసుకోవచ్చనే పరిశీలించడం కోసం ఉన్నత విద్యా మండలి ప్రొఫెసర్లతో కమిటీని ఏర్పాటు చేయనుంది. జేఎన్‌టీయూ, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగంలోని ప్రొఫెసర్లతో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. కమిటీ నివేదిక అనంతరమే ఆయా కాలేజీలకు.. వారు పంపించిన బి కేటగిరీ సీట్లకు రాటిఫికేషన్‌ను మంజూరు చేయాలనే ఆలోచనలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఉన్నట్టు తెలిసింది.

**అదనపు ఫీజుల వసూలుపై కూడా..**

రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు 2022-23 నుంచి 2024-25 బ్లాక్ పిరియడ్‌కు సంబంధించిన ఫీజులను టీఏఎఫ్ఆర్‌సీ ప్రతిపాదనల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజులను ఖరారు చేస్తూ జీవోలను జారీ చేసింది. అయితే రాష్ట్రంలోని చాలా కాలేజీలు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను కాకుండా అదనంగా ఫీజులను వసూలు చేస్తున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. కాలేజీ డెవలప్‌మెంట్ ఫీజు అంటూ.. లైబ్రరీ ఫీజంటూ ఇతరత్ర పేర్లతో సుమారు రూ. 30వేల నుంచి రూ. 50 వేల వరకు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటువంటి వాటిపై కూడా చర్యలు తీసుకోవడానికి ఉన్నత విద్యా మండలి సిద్ధం అవుతున్నట్టు తెలిసింది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కూడా ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేయడానికి వీల్లేదని ఉన్నత విద్యా మండలి అధికారులు స్పష్టం చేస్తున్నారు. అలా వసూలు చేసే కాలేజీలపై ఫిర్యాదుల మేరకు తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఉన్నత విద్యా మండలి ఉన్నతాధికారులు చెబుతున్నారు.

# ధరణి వల్ల రైతులకు అనేక ఇబ్బందులు

- కలెక్టర్ల నుంచి సరైన స్పందన లేదు
- సిఎల్‌పి కార్యాలయంలో ధరణి, భూసమస్యలపై కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశం
- పాల్గొన్న రేవంత్, సీనియర్ నేతలు
- పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** ధరణి వల్ల రైతులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జగ్గారెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్‌ల నుంచి సరైన స్పందన లేదు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ పాయిట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అంతకుముందు సిఎల్‌పి కార్యాలయంలో ధరణి, భూ సమస్యలపై ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, జాతీయ నాయకులు కొప్పురాజు, ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి, ఈరవత్రి అనిల్, హర్కర వేణుగోపాల్, ప్రీతం, చెరుకు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో గ్రామ రెవెన్యూ సదస్సు ఉండేవి, అక్కడే సమస్య పరిష్కారం అయ్యేవి, వ్యూవకర్త సునీల్ కొనుగోలు కొంత డేటా అందజేశారు. ధరణిలో చాలా లోటు పాట్లు అనేక అవకతవకలు ఉన్నాయన్నారు. రైతుల పక్షాన హైకోర్టులో కూడా పిల్ కూడా వేశామన్నారు. కానీ ఇప్పటి వరకు ఆ పిల్ బెంచ్ మీదకు రాలేదన్నారు. కాంగ్రెస్ వస్తే ధరని ఉంచాలా లేదంటే సరికొత్త విధానం ఏమైనా తీసుకుని రావాలా అనే దానిపై చర్చించామన్నారు. గంటన్నర ధరణి మీద కులంకషంగా అందరం మాట్లాడుతున్నామన్నారు. ఈనెల 11న ప్రతి మండలంలో ఐదుగురు చొప్పున మూడు వేల మందికి శిక్షణా సమావేవం నిర్వహిస్తామన్నారు. వారి నుంచి తీసుకున్న ఇన్‌పుట్‌తో పార్టీ స్టాండ్ వెల్లడిస్తాం. ధరణి, రైతుల సమస్యలపై స్పష్టమైన విధానంతో ప్రజల్లోకి వెళ్తామన్నారు. 20 లక్షల 30వేల మంది రైతులు ధరణితో ఇబ్బందులు పడుతున్నట్లు దృష్టికి వస్తుందన్నారు.

**బిజెపి, టిఆర్ఎస్ రెండు ప్రభుత్వాలు స్కాంల ప్రభుత్వాలే : జగ్గారెడ్డి**

బిజెపి, టిఆర్ఎస్ రెండు ప్రభుత్వాలు స్కాంల ప్రభుత్వాలే అని ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిజెపి జనరల్ సెక్రటరీ బిఎల్ సంతోష్, టిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇద్దరు నేరగాళ్లే అన్నారు. మోడి, అమిత్ షాలు వెనుకాల ఉండి బిఎల్ సంతోష్‌ని ముందు పెట్టి ఎమ్మెల్యేలను కొంటున్నారన్నారు. సంతోష్‌ను కాపాడేందుకు బిజెపి ప్రయత్నం చేస్తుందన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితను అరెస్టు చేస్తారనే భయం ఉన్నప్పటికీ పైకి అరెస్టు చేసుకోండని అంటుంది. 32 వేల టీచర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలనీ సిఎం కెసిఆర్ సిఎం కెసిఆర్‌కు లేఖ రాస్తున్నట్లు తెలిపారు. పదివేల మందికి పదోన్నతుల ఆగిపోయాయని అన్నారు.

# వైఎస్సార్‌టిపిని ఆపడం ఎవరితరం కాదు

- రేపటి నుంచి పాదయాత్ర, 14న ముగింపు
- కోర్టు ఆదేశాలను డిజిపి ఆఫీస్‌లో అదనపుడిజికి అందజేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 2:** ఎవరెన్ని దాడులు చేసినా...కొట్టినా చంపినా ఎట్టి పరిస్థితుల్లో బెదిరేది లేదని, రాష్ట్రంలో వైఎస్సార్ పాలన తిరిగి తీసుకొచ్చే వరకు పోరు ఆగదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పునరుద్ఘాటించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఈనెల 4 నుంచి డిసెంబర్ 14 వరకు పాదయాత్ర కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నిస్తామని చెప్పారు. శుక్రవారంనాడు డిజీపీ కార్యాలయంలో అదనపు డీజీ జితేందర్‌ను కలిసిన షర్మిల పాదయాత్ర నిర్వహించేందుకు కోర్టు ఇచ్చిన ఆదేశాలను అందించారు. పాదయాత్రకు భద్రత కల్పించాలని కోరారు. టిఆర్ఎస్ నాయకులు ఎక్కడ తమ పాదయాత్రను అడ్డుకున్నారో అక్కడి నుంచే ప్రారంభిస్తామని వైఎస్ షర్మిల వివరించారు. ఆగిన చోట నుంచే పాదయాత్ర తిరిగి ప్రారంభిస్తామని పేర్కొన్నారు. డిసెంబర్ 14 పాదయాత్ర ముగుస్తుందని, దాదాపు 4వేల కి.మీ. మేర పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 3,525 కి.మీ. మేర పాదయాత్ర పూర్తి చేశానని తెలిపారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని పేర్కొన్నారు.

టిఆర్ఎస్ నుంచి ఉద్యమకారులను సాగనంపారని, ప్రస్తుతం స్వార్థపరులే టిఆర్ఎస్‌లో కొనసాగుతున్నారన్నారు. టిఆర్ఎస్ నాయకుల మాటలకు బెదిరిపోనని, నా పార్టీని ఆపడం ఎవరితరం కాదని, వైఎస్సార్ కాంగ్రెస్ తెలంగాణ పార్టీ ఉదయించే సూర్యుడు, అర చేయితో ఆపలేరని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ పాలన తిరిగి తీసుకొచ్చే వరకు పోరాడుతామని, కెసిఆర్ వైఫల్యాలను ప్రతిరోజు ఎత్తి చూపుతామని షర్మిల పేర్కొన్నారు. డిజిపి కార్యాలయానికి వెళ్లే ముందు లోటస్ పాండ్‌లోని తన నివాసంలో పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, టిఆర్ఎస్ వ్యవహారశైలి, పోలీసు నిర్బంధాలు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతల బెదిరింపులు, పాదయాత్ర కొనసాగింపుపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఆమె సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ నేతల అభిప్రాయాలు తీసుకున్న షర్మిల... పాదయాత్రను తిరిగి ఈ నెల 4 నుంచి మొదలు పెట్టి 14వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు ప్రకటించారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం లింగగిరి గ్రామం నుంచి పాదయాత్ర తిరిగి ప్రారంభిస్తామనిర షర్మిల తెలిపారు. ఆపద సమయంలో తనతో ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తు పెట్టుకుంటామని వారంతా తన కుటుంబమని పేర్కొన్నారు.

# జగ్గారెడ్డికి, నాకు తోడికోడళ్ల పంచాయతీనే!

## పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి మధ్య ఆసక్తి కర సంభాషణ జరిగింది. ధరణి, భూ సమస్యలపై చర్చించేందుకు సిఎల్‌పి కార్యాలయానికి వస్తున్న సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఎదురుపడ్డారు. ఇద్దరు కలిసి సిఎల్‌పిలోకి వెళ్లారు. ఇద్దరి మధ్య ఆసక్తికరణ సంభాషణచోటు చేసుకుంది. జగ్గారెడ్డికి, నాకు మధ్య జరిగేది తోడికోడళ్ల పంచాయితీనే అన్నారు పొద్దునతిట్టుకుంటా, మల్లి కలిసిపోతామంటూ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తమ ఇద్దరి మధ్య ఎలాంటి విభేదాలు లేవని రేవంత్, జగ్గారెడ్డిలు స్పష్టం చేశారు. రేవంత్ పాదయాత్రకు నా మద్దతుపై త్వరలోనే ప్రకటన చేస్తామన్నారు. ఇంకా పదేళ్లు అయినా రేవత్ దిగిన తరువాతే నేను పిసిసి అవుతానని, రేవంత్‌ను దింపి పిసిసి కావడం సాధ్యం కాదంటూ జగ్గారెడ్డి వ్యాఖ్యనించారు.



# తెలంగాణ ఎక్సైజ్ పాలసీపై సిబిఐ విచారణ జరిపించాలి

## బిజెపి నేత ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** తెలంగాణ ఎక్సైజ్ పాలసీపై సిబిఐ విచారణ జరిపించాలని బిజెపి నేత ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో లిక్కర్ పాలసీకి తెలంగాణ పాలసీనిక పోలిక ఉందన్నారు. ఎనిమిది సంవత్సరాలలో రెండు సార్లు లిక్కర్ పాలసీ మార్చి రెండు సార్లు రేట్లు పెంచారన్నారు. ఢిల్లీలో లిక్కర్ సరఫరా చేసిన వారే తెలంగాణలో కూడా సరఫరా చేశారన్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీకి తెలంగాణ లిక్కర్ పాలసీ ఆదర్శమైందని చెప్పుకొచ్చారు. ఎమ్మెల్సీ కవిత మాట వినే వ్యక్తినే ఎక్సైజ్ శాఖకు మంత్రిని చేశారన్నాఉ. అదేవిధంగా చీఫ్ సెక్రటరీ మాటవినే వ్యక్తినే ఎక్సైజ్ కమిషనర్ బాధ్యతలు అప్పజెప్పారన్నారు. దళితబంధు, డబుల్ బెడ్ రూం ఇళ్లలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందన్నారు. లబ్దిదారుల ఎంపిక ఎమ్మెల్యేలకు ఇవ్వడంతో అవినీతి పెరిగగిందన్నారు.

## ప్రశ్నించిన ఐటి

≫ మని మంత్రి మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. విచారణలో అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చామన్నారు. డిసెంబర్ 5వ తేదీ వరకు తమ ఎడ్యుకేషన్ సొసైటీకి సంబంధించిన విషయంలో చాలా మందికి నోటీసులు పంపించారని తెలిపారు. క్లర్లు స్థాయి నుంచి అకౌంటెంట్ డైరెక్టర్ల వరకూ నోటీసులు ఇచ్చారని చెబుతున్నారు. డబ్బులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి తననేమీ ఐటీ శాఖ అధికారులు ప్రశ్నించలేదని లక్ష్మణ్‌రెడ్డి తెలిపారు. తాను ఎంఎల్ఆర్ఐటీ చైర్మన్‌గా మాత్రమే ఉన్నానని, ఆర్థిక లావాదేవీలకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాను కాలేజీలో పిల్లల ఫిట్‌నెస్, స్పోర్ట్స్ విషయాలు మాత్రమే చూసుకుంటానని, ఇదే విషయాన్ని ఐటీ అధికారులకు చెప్పానన్నారు. ఈనెల 30వ తేదీన మరోసారి విచారణకు రావాలని నరసింహారెడ్డి, త్రిశూల్‌రెడ్డికి ఐటీ అధికారులు చెప్పారు. గత నెల 22,23 తేదీల్లో మంత్రి మల్లారెడ్డి ఇండ్లు, ఆఫీసులు, కాలేజీలతో పాటు ఆయన బంధువులు, సన్నిహితుల ఇళ్లలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. భారీగా నగదుతో పాటు కొన్ని కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో నవంబర్ 28న విచారణకు హాజరు కావాలని మంత్రి మల్లారెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు, ఉద్యోగులకు నోటీసులు ఇచ్చారు.

## ప్రత్యేక మంత్రిత్వ శాఖ

≫ దివ్యాంగుల సంక్షేమంపై మరింత దృష్టి సారించేందుకు వీలుగా ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు సంక్షేమం, సమర్థ సేవలు అందించేందుకు వీలుగా జిల్లా స్థాయిలోనూ మహిళ, శిశు సంక్షేమ శాఖ నుంచి వేరు చేశారు. దీనికి జిల్లా సంక్షేమ అధికారిని నియమిస్తారు. మహిళ శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమం శాఖల మధ్య ప్రతి జిల్లాకు శాఖాపరమైన ఏర్పాట్లు చేయనున్నారు.

# మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారుతున్న భారత్

- అంతర్జాతీయ రేటింగ్స్ మోర్గాన్‌స్టాన్లీ విశ్లేషణ



**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** జపాన్, జర్మనీని అధిగమించి 2030 నాటికి భారత్‌మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనావేసింది. అప్పటికల్లా భారత స్థూల జాతీయోత్పత్తి(జిడిపి)వృద్ధిరేటు సగటున 6.3శాతంగా ఉంటుందని వెల్లడించింది. 2031 నాటికి భారత జిడిపి ప్రస్తుత స్థాయినుంచి రెండురెట్లు వృద్ధిచెందుతుందని తెలిపింది. భారత్‌కు విదేశీ కంపెనీలు తరలిరావడం తయారీ రంగంలోకి పెట్టుబడుల వెల్లువ, నూతన ఇంధన వనరులదిశగా మార్పు, అత్యాధునిక డిజిటల్ మౌలికవసతులు భారత వృద్ధికి ఊతమిస్తాయనిమోర్గాన్ స్టాన్లీ తెలిపింది. వీటితోపాటుప్రభుత్వం చేపడుతున్న నిర్మాణాత్మక సంస్కరణలు సైతం దోహదంచేస్తాయని పేర్కొంది. ఆర్థిక సరళీకరణలు, కార్మికచట్టాల్లో సవరణలు మౌలికవసతుల్లో మూలధన వ్యయం సైతం భారత ఆర్థికవ్యవస్థను మరింత మెరుగుపరుస్తుందని మోర్గాన్ వెల్లడించింది. భారత్‌ను ఎగుమతులకేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలుచర్యలుచేపట్టింది. మోర్గాన్ స్టాన్లీ అంచనాల్లో భారత్ తయారీ హబ్‌గాను అవతరిస్తుందని వెల్లడించింది. ఇందుకోసం ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలపథకం వంటివి ఎంతోమేలుచేస్తాయని వివరించింది. భారత జిడిపిలో తయారీరంగవాటా 2031నాటికి 21శాతానికిచేరుతుందని అంచనావేసారు. ఈ రంగం ఆదాయం 447 బిలియన్‌డాలర్లనుంచి 1490 బిలియన్ డాలర్లకుచేరుతుందనితెలిపారు. అయితే ఈప్రయాణంలో కొన్ని అవాంతరాలు భారత ఆర్థిక వ్యవస్థకు సవాల్‌విసిరే అవకాశం ఉందని మోర్గాన్‌స్టాన్లీ తెలిపింది. ప్రపంచ ఆర్థిక మాంద్యం అందులోప్రధానమైందని వెల్లడించింది ఎగుమతులకంటే దిగుమతులు వేగంగా వృద్ధిచెందుతుండటం కూడా దేశ ఆర్థికవ్యవస్థకు ఆటంకంగా మారవచ్చని విశ్లేషించింది.

# డిస్కౌంట్ ధరకు క్రూడియిల్ కోరిన పాక్

## తిరస్కరించిన రష్యా

**ఇస్లామాబాద్, డిసెంబరు 2 :** ఉక్రెయిన్‌పై యుద్ధంతో రష్యాపై పశ్చిమ దేశాల ఆంక్షల నేపథ్యంలో..క్రూడాయిల్‌ను తక్కువ ధరకే భారత్, చైనాసహా మరికొన్ని దేశాలకు రష్యా విక్రయిస్తోంది. దాంతో, భారత్, చైనాలకు క్రూడాయిల్ దిగుమతుల విషయంలో ఖర్చులు తగ్గాయి. ఈ విషయం గ్రహించిన పాకిస్థాన్..తమకూ డిస్కౌంట్ ధరకు క్రూడాయిల్ విక్రయించాలని రష్యాను కోరగా, తిరస్కరించింది. పాక్‌కు చెందిన బృందం ఇటీవల మూడురోజుల పర్యటన కోసం రష్యా వెళ్లింది. ఆ సందర్భంగా రష్యా అధికారులతో ఆ బృందం చర్చలు జరిపింది. క్రూడాయిల్‌పై తమకు 30..40 శాతందాకా డిస్కౌంట్ ఇవ్వాలని ఆ బృందం రష్యాను కోరింది. అందుకు స్పందించిన రష్యా..ఇప్పటికే పెద్ద కొనుగోలుదారులకు సరఫరా చేయడానికి అంగీకరించామని, ప్రస్తుత తరుణంలో హామీ ఇవ్వలేమని పాక్ బృందానికి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అయితే, పాక్ అభ్యర్థనను పరిశీలిస్తామని రష్యా చెప్పినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పాక్ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉన్నదన్నది గమనార్హం. దాంతో, అభివృద్ధి చెందిన దేశాల నుంచి పలు రాయితీల కోసం ఆ దేశం యత్నిస్తోంది.

# రష్యా వ్యతిరేక కూటమిలోకి భారత్‌ను లాగేందుకు నాటో యత్నం: రష్యా ఆరోపణ

**మాస్కో, డిసెంబరు 2 :** రష్యా వ్యతిరేక కూటమిలోకి భారత్‌ను లాగేందుకు నాటో యత్నిస్తోందని రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్రోస్ ఆరోపించారు. అదేవిధంగా రష్యాకు ముప్పు వాటిల్లేలా చైనా సమీపంలో ఉద్రిక్తతలను పెంచుతోందన్నారు. నాటో తన ఆధిపత్యం చెలాయించాలనుకుంటున్న ప్రాంతాల్లో ఇప్పుడు దక్షిణచైనా సముద్రాన్ని చేర్చుతోంది. ఉక్రెయిన్ విషయంలోనూ ఇలాగే చేసి ఉద్రిక్తతలు పెంచింది అని లావ్రోస్ విమర్శించారు. చైనా, తైవాన్ మధ్య వివాదాన్ని పేర్కొంటూ ఆ ప్రాంతంలో నాటో నిప్పుతో చెలగాటం ఆడుతోంది. దాంతో, రష్యాకూ ముప్పేనని లావ్రోస్ అన్నారు. ఆ ప్రాంతం చైనాకు ఎంత దగ్గరగా ఉందో, మాకూ అంతే దగ్గరగా ఉందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలోనే రష్యా..చైనాతో సైనిక సహకారాన్ని పెంచుకుంటోందని, ఉమ్మడి విన్యాసాలు నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. పాశ్చాత్య దేశాలు రష్యా ప్రభావాన్ని అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నాయని లావ్రోస్ ఆరోపించారు. తైవాన్ ప్రాంతంలో అమెరికా నేతృత్వంలోని నాటో దేశాలు విధ్వంసక పరిస్థితులు సృష్టించేందుకు యత్నిస్తున్నాయనే విషయం అందరికీ తెలుసని ఆయన గుర్తు చేశారు. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాల మధ్య కూటమిని ఆయన ప్రస్తావించారు.


# దివ్యాంగులకు ఇ లెర్నింగ్ ప్రోగ్రాం

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త :** దివ్యాంగులకు ఇ లెర్నింగ్ ప్రోగ్రాం నిర్వహించే విషయంలో తెలంగాణ వికలాంగుల సంక్షేమ శాఖ 150 నిముషాల నిడివి కలిగిన 32 వీడియోలను అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు దీనికి సంబంధించి హైదరాబాద్‌లోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఈ వీడియోలను రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి దివ్య, వికలాంగుల సంక్షేమ శాఖ డైరక్టర్ శైలజతో కలిసి తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి ప్రారంభించారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వికలాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా వికలాంగు సంక్షేమ శాఖలోని ఉద్యోగులకు ప్రత్యేక అవసరాలు ఉన్న వ్యక్తుల యొక్క వివిధ రకాల వైకల్యాలు తదితర విషయాలను పరిగణలోకి తీసుకుని దీనికి నాంది పలికారు. శాస్త్రీయంగా సాంకేతిక మాధ్యమ సహాయంతో మరింత అవగాహన కల్పించి, వికలాంగుల సంక్షేమానికి ఉత్తమ సేవలను అందించేందుకు ఈ లెర్నింగ్ ప్రోగ్రాంను ఆవిష్కరించడం జరిగిందని ఈ సందర్భంగా దివ్య పేర్కొన్నారు.

# రైలుబోగీ కిటికీలోంచి దూసుకువచ్చిన ఇనుపరాడ్

## ప్రయాణికుడి మెడలో దిగబడి అక్కడికక్కడే మృతి

**లక్నో, డిసెంబరు 2:** ఢిల్లీనుంచి కాన్పూరు వెళుతున్న నీలాంచల్ ఎక్స్‌ప్రెస్‌లో ఒకప్రయాణీకుడి కంఠంలోకి ఇనుపరాడ్ దూసుకుపోవడంవల్ల మృతిచెందిన సంఘటనపై రైల్వే శాఖ దర్యాప్తుచేపట్టింది. సోమ్నా, డన్‌బార్ రైల్వేస్టేషన్ల మధ్య ఐదు అడుగుల పొడవైన ఐరన్‌రాడ్ రైలుబోగీ కిటికీలను బద్దలుకొట్టుకుంటూ లోపలికి వచ్చి ఒక ప్రయాణీకుడి కంఠంలో దిగబడింది. బోగీలో కిటికీ పక్కనే కూర్చుని ఉన్న ప్రయాణీకుడికి ఈ రాడ్‌పొడుచుకోవడంతో అక్కడికక్కడే చనిపోయాడు. సుల్తాన్‌పూర్‌జిల్లా గోపీనాథ్‌పూర్‌కు చెందిన హరికేష్‌కుమార్ దూబేగా మృతుడిని గుర్తించారు. ఆలీఘర్ రైల్వేస్టేషన్‌కు రైలు రాగానే ఆతని మృతదేహాన్ని కిందకు దించారు. సమాచారం తెలుసుకున్న వెంటనే ప్రయాణీకులు ఆలీఘర్ రైల్వేస్టేషన్‌కు దూసుకువచ్చారు. ఇదే ఐరన్‌రాడ్‌మరోవైపు బోగీలమధ్యనుంచి కూడా వెళ్లింది. అయితే ఎవ్వరూ గాయపడలేదు. అయితే రైల్వే అధికారులు మాత్రం నిర్మాణంలో ఉన్న కట్టడం వల్ల ఈ ప్రమాదంజరిగిందనడాన్ని అంగీకరించడంలేదు. రైల్వేపోలీస్‌ఫోర్స్, జిఆర్‌పి సంయుక్తంగా ఈకేసును దర్యాప్తుచేస్తున్నట్లు సిపిఆర్‌ఒ హిమాంశు ఉపాధ్యాయ్ వెల్లడించారు. ఈసంఘటన జరిగిన ఖచ్చితమైన ప్రాంతాన్ని గుర్తించేందుకు ప్రస్తుతం అధికారులు కృషిచేస్తున్నారు.



# విద్యార్థులపైకి దూసుకువెళ్లిన టిప్పర్ లారీ

## విద్యార్థి రిత్విక్ మృతి.. ఇరువురికి గాయాలు

**చేవెళ్ల, డిసెంబరు 2, ప్రభాతవార్త :** పాఠశాలకు వెళ్లేందుకు బస్సు కోసం రోడ్డు పక్కన బస్ స్టాప్‌లో నిలపడిన విద్యార్థులపైకి టిప్పర్ లారీ దూసుకువెళ్లిన ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చేందిగా, ఇరువురికి తీవ్ర గాయాలైన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిదిలో జరిగింది. చేవెళ్ల సిఐ వెంకటేశ్వర్ కథనం ప్రకారం, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం చేవెళ్ల మండలం గోల్లపల్లి గ్రామానికి చేందిన బొడపోతుల రాజుగౌడ్, శశికళ దంపతులకు ఇద్దరు కుమారులు అభిలాష్, రిత్విక్‌లు చేవెళ్లలోని క్రిష్ణావేణి ప్రైవేట్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. శుక్రవారం ఉదయం శశికళ తన కుమారులు పాఠశాలలకు పంపించేందుకు నానమ్మ యాదమ్మను తోడుగా తీసుకుని బస్ స్టాప్‌కి వచ్చి బస్ కోసం వేచిచూస్తుండగా చేవెళ్ల నుండి శంకర్‌పల్లి వైపు వెళ్తున్న టిప్పర్ లారీ డ్రైవర్ అతివేంగా అజాగ్రత్తగా లారీని నడుపడంతో అదుపుతప్పి డివైడర్‌ను డీ కోట్టి ఒక్కసారిగా బస్ కోసం వేచి చూస్తున్న విద్యార్థులపైకి దూసుకువెల్లింది. ఈ ప్రమాదంలో విద్యార్థి రిత్విక్ అక్కడికక్కడే మృతి చేందాడు. లారీ అతివేగంగా దూసుకుపోవడంతో కల్వర్టును డీ కోట్టి ఇళ్ల మద్యలోని గోడను తగిలింది. టిప్పర్ లారీ డీ కోట్టిగా మరో బాలుడు అభిలాష్ రోడ్డు పక్కన పోదల్లో పడిపోయాడు. తీవ్ర గాయాలతో గాయపడిన బాలుడుని చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. యాదమ్మకు కూడ తీవ్ర గాయాల పాలుకావడంతో అసుపత్రికి తరలించారు. సంఘటన స్థలంకు సిఐ వెంకటేశ్వర్ చేరుకుని అజాగ్రత్తగా లారీ టిప్పర్‌ను నడిపిన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని, రోడ్డుపైన స్పీడ్ బ్రెకర్‌లను వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. రోడ్డుపైన స్పీడ్ బ్రెకర్‌లను వేయిస్తామని సిఐ వెంకటేశ్వర్ హామి ఇవ్వడంతో గ్రామస్తులు దర్నాను విరమించారు. కెసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వెంకటేశ్వర్ తెలిపారు.

